www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 11 జనవరి 2024 | 5 | కాకినాడ



ఎల్ఐసి ఉద్యోగుల వాకౌట్ సమ్మె

ప్రజాశక్తి - కోటనందూరు

ఎల్ఐసి వేతన సవరణ గడువు ముగిసినా యాజమాన్యం చర్చలకు పిలవక పోవడాన్ని నిరసిస్తూ ఎల్ఐసి ఉద్యోగులు బుధవారం వాకౌట్ సమ్మెను చేపట్టారు. అధికారుల సంఘం అధ్యక్షులు ప్రభాకర్ రావు ఆదేశాలతో తుని ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో గంటపాటు కార్యాలయాన్ని మూసివేసి వాకౌట్ సమ్మెను నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వేతన సవరణ గడువు ముగిసిపోయినా యాజమాన్యం చర్చలకు పిలక వపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా, రామ సత్యనారాయణ, సాయి మహాలక్ష్మి, శ్రీని వాస్, డవలంప్‌మెంట్ అధికారి జె.సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నేతలు మెక్కిందంతా కక్కిస్తాం...

'రా..కదిలి రా' బహిరంగ సభలో చంద్రబాబు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, కోటనందూరు

ఐదేళ్ల పాటు వైసిపి నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని, తాము అధికారంలోకి రాగానే వైసిపి నేతలు మెక్కిందంతా కక్కిస్తామని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తునిలోని చామవరంలో బుధవారం నిర్వహించిన 'రా.. కదిలిరా' బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ నేడు రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేశారన్నారు. ప్రజలపై పెనుభారాలు మోపారన్నారు. జగన్ అహంకారమే అతని అంతానికి దారి తీసే పరిస్థితి నేడు నెలకొందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఓడించి రాష్ట్రాన్ని గెలిపించాలన్నారు.

భారీగా పెరిగిన నిత్యవసరాలు

5 ఏళ్లలో రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. టిడిపి హయాంలో రూ.70 ఉన్న పెట్రోలు నేడు రూ.110కి, రూ.70 ఉన్న డీజిల రూ.98 పెరిగాయన్నారు. బియ్యం, పప్పుల ధరలు రెట్టింపు అయ్యాయన్నారు. వంటనూనె రూ.60 నుంచి రూ.130కి ఎగబాకిందన్నారు. ఎల్‌పిజి గ్యాస్ సామాన్యులు కొనుగోలు చేయని పరిస్థితికి వచ్చిందన్నారు. పెరిగిన ధరలతో మళ్లీ కట్టెల పొయ్యిపై ఆడబిడ్డలు వంట చేసుకుంటున్నారన్నారు. టిడిపి అధికారంలోకొస్తే ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. పండుగ వేళ ప్రజలు పస్తులుండే పరిస్థితిని తీసుకొచ్చారన్నారు.

టిడిపితోనే ప్రజల జీవితాల్లో వెలుగులు

సంక్షేమం, అభివృద్ధితో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపింది టిడిపియేనని బాబు అన్నారు. పేదల్ని ఆదుకునే బాధ్యత తనదేనన్నారు. అన్న క్యాంటీన్లు మళ్లీ ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చుతానని తెలిపారు. టిటిడిలోనూ భక్తులకు నాసిరకం భోజనం పెట్టడం దుర్మార్గమన్నారు. త్వరలోనే పేదల ప్రభుత్వం, రైతు రాజ్యం వస్తుందన్నారు. వచ్చే సంక్రాంతికి ప్రజల ముఖాల్లో వెలుగులు నింపుతామన్నారు. మ్యానిఫెస్టోలో అంశాలను ఆయన వివరించారు.



సభకు హాజరైన జనం, ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు



నిరాశలో నిరుద్యోగులు

జగన్ నిరుద్యోగులను తీవ్రంగా నిరాశపరిచారని బాబు అన్నారు. జాబ్ క్యాలెండర్, మెగా డిఎస్‌సిలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తమ పాలనలో లక్షలాది టీచర్ పోస్టులను భర్తీ చేశామని గుర్తు చేశారు. జగన్ ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయలేదన్నారు. జాబు కావాలంటే బాబు రావాలన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చారు. అన్నదాత పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.20వేలు ఇస్తామన్నారు. ఆక్వా రైతుల్ని ఆదుకుంటామని తెలిపారు. జగన్ అప్పుల కోసం ప్రభుత్వ ఆస్తుల్ని తాకట్టు పెట్టారన్నారు. మళ్లీ గెలిస్తే ప్రజల్ని కూడా తాకట్టు పెడతాడని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టించి ఆదాయం పెంచుతామని హామీ ఇచ్చారు.

రాజధాని లేకుండా చేశారు

మూడు రాజధానుల పేరుతో జగన్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హయాంలో రాజధానిగా అమరావతే ఉంటుందని స్పష్టం చేశారు. పరిశ్రమల పొల్యూషన్ కంట్రోల్ చేసి మత్స్యకారులను రక్షిస్తామన్నారు. మత్స్యకారులను తామే ఆదుకున్నామన్నారు. జగన్ జిఒ 217 తీసుకొచ్చి మత్స్యకారుల పొట్టకొట్టారన్నారు. మద్య నిషేధం, పోలవరం, సీపీఎస్ రద్దు, ప్రత్యేక హోదా హామీలు ఏమయ్యాయన్నారు.

మంత్రి రాజా అక్రమాలపై ధ్వజం

స్థానిక మంత్రి దాడిశెట్టి రాజా అక్రమాల రాజాగా మారారన్నారు. చెక్ పోస్టుల్లో వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ఆయన మామూళ్లకు వ్యాపారులు పరారవుతున్నారని విమర్శించారు. 200పైగా ఎకరాలు కబ్జా చేశారన్నారు. కాకినాడ ఎంఎల్ఎ ద్వారంపూడి గంజాయి రవాణాకు ద్వారం తెరిచాడని తెలిపారు. బియ్యం మాఫియాను నడుపుతున్నది ద్వారంపూడి అని ఆరోపించారు. ఎంఎల్ఎ కన్నబాబు చేసిన అవినీతి అంతా ఇంతా కాదన్నారు. ఎంఎల్ఎలను మార్చడం కాదు ప్రజలనే జగన్‌ను మార్చేందుకు సిద్ధమయ్యారన్నారు. ఎస్‌సి, బిసి ఎంఎల్ఎలను మారుస్తున్న జగన్ పెద్దిరెడ్డి, ద్వారంపూడిలను ఎందుకు మార్చలేదని ప్రశ్నించారు. ఈ జిల్లాలో మిధున్ రెడ్డి, ఉత్తరాంధ్రలో విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిల పెత్తనం ఏంటన్నారు.

టిడిపి అధికారంలోకి వచ్చాక తాండవ రిజర్వాయర్ ఆధునికీకరిస్తామని, పోలవరం పూర్తి చేసి భవిష్యత్తులో 3 పంటలకు నీళ్లిస్తామన్నారు. వేముల వాడ, పెద్దాపురం ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయిస్తామన్నారు. పుష్కర ఎత్తిపోతల పథకం, టూరిజాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కాకినాడకు పూర్వవైభవం తెచ్చే బాధ్యత టీడీపీ జనసేనదేనని హామీ ఇచ్చారు. ఈ సభలో టిడిపి మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత, మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, చిన్న రాజప్ప, బండారు సత్యానందరావు, చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎంఎల్ఎలు వనమాడి కొండబాబు, ఎస్‌విఎస్ఎన్.వర్మ, దాట్ల బుచ్చిబాబు, అయితాబత్తుల ఆనందరావు, టిడిపి నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు వరుపుల సత్యప్రభ, యనమల దివ్య, మహాసేన రాజేష్ జనసేన నాయకులు పంతం నానాజీ, తుమ్మల రామస్వామి, ఉదయ్ శ్రీనివాస్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ఎస్ఎస్ఎ ఉద్యోగుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - కాకినాడ

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె 22వ రోజు సందర్భంగా రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు ఎస్ఎస్ఎ ఉద్యోగులు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. భానుగుడి సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు, దేవాలయం వీధి, కలెక్టరేట్ మీదుగా ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కాకినాడ జెఎసి జిల్లా అధ్యక్షుడు ఎం.చంటిబాబు మాట్లాడుతూ మంత్రి బొత్స సత్యనారాయణతో చర్చలు విఫలమైతే నిరవధిక సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమగ్రశిక్ష ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, అన్ని కేంద్ర పథకాల్లో ఉద్యోగులకు అమలవుతున్న హెచ్ఆర్ పాలసీని సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులకు కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికారులు చర్చల పేరుతో కాలయాపన చేయడాన్ని మానుకోవాలని హితవు పలికారు. చట్టబద్ధంగా నెలరోజుల ముందు సమ్మె నోటీస్ ఇచ్చి సమ్మె చేస్తున్న ఉద్యోగులపై షోకాజ్ నోటీసులు, టర్మినేషన్ లెటర్లు ఇచ్చి మా ఉద్యమాన్ని ఆపలేరని, ఈ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని తెలిపారు. అనకాపల్లిలో జగన్ ప్రభుత్వం బలి తీసుకున్న సమగ్రశిక్ష ఉద్యోగి జడ్డు వాసుదేవరావు కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగం ఇవ్వాలని, పిల్లల బాధ్యత ప్రభుత్వమే చూసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలా ఎంతమంది ప్రాణాలు బలితీసుకుంటారో జగన్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఈ శిబిరానికి తాళ్లరేవు మండలం జి.వేమవరం టీచర్లు ప్రసునా, పద్మావతి, కామేశ్వరి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జెఎసి నాయకులు సత్యనాగమణి, ఎంవి.సాయికిరణ్, ఎ. లోవరాజు, పివి వి.మహాలక్ష్మి, ఎం.రాధా కృష్ణ, కె.చం ద్రశేఖర్, జి.నారాయణ, ఎంబి.సాల్మన్, పి. రాజు, కె.శ్రీనివాస్, ఎం.గంగాధర్ నాయకత్వం వహించారు.

పారిశుధ్య సమస్య తలెత్తరాదు

ప్రజాశక్తి - కాకినాడ

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు సమ్మె నేపథ్యంలో నగరంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు ఆదేశించారు. నగరంలోని కరణం జంక్షన్, నరసన్న నగర్, రామారావు పేట, గాంధీనగర్, వివేకానంద పార్క్, బాలాజీ చెరువు ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. కార్మికుల సమ్మె కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్య సేవలు అందించాలన్నారు. ఎక్కడా చెత్త పేరుకు పోకుండా అందుబాటులో ఉన్న సిబ్బందితో మెరుగైన పారిశుధ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎంహెచ్ఓ డాక్టర్ పృధ్వీచరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సత్తెప్ప నాయుడు, రవివర్మ, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



క్షేత్ర స్థాయి పర్యటనలో కమిషనర్



సేవ్యానంద్ మహారాజ్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

యువతకు ఆదర్శం స్వామి వివేకానంద

ప్రజాశక్తి - కాకినాడ

యువతకు ఆదర్శం స్వామి వివేకానంద అని రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ స్వామీజీ సేవ్యానంద మహారాజ్ అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, కాకినాడ నెహ్రూ యువ కేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'యువతకు స్వామి వివేకానంద ఎందుకు మార్గదర్శకులు?' అనే అంశంపై ఆయన మాట్లాడారు. యువత స్వామి వివేకానందుని సాహిత్యం చదవాలని సూచించారు. నెహ్రూ యువ కేంద్ర సభ్యులు సూరపురెడ్డి సత్య సూర్య మాట్లాడుతూ యువత దేశభక్తితో మెలగాలన్నారు. ఈ కార్యక్రమానికి ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు అధ్యక్షత వహించి మాట్లాడుతూ యువత తమ లక్ష్యసాధనలో వివేకానందుని సాహిత్యం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్ ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒలు టి.తేజేశ్వరరావు, ఎల్.దివాకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

30 రోజులుగా రోడ్లపైనే...

-అంగన్‌వాడీలకు పెరుగుతున్న మద్దతు
-కొనసాగుతున్న 24 గంటల దీక్షలు

ప్రజాశక్తి - యంత్రాంగం

అంగన్‌వాడీలు చేపట్టిన రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె బుధవారం నాటికి 30వ రోజుకు చేరింది. గత 30 రోజులుగా అవిశ్రాంతంగా రోడ్లపైనే తమ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, మానవహారాలు, ర్యాలీల ద్వారా తమ నిరసనను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు అయినా రాష్ట్ర సర్కార్‌కు ఏమాత్రం చలనం లేకుండా పోయింది. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీని అమలు చేయాల్సిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అంగన్‌వాడీల ఉద్యమాన్ని అణిచివేసేందుకు సిద్ధం అయ్యారు. కనీస వేతన చట్టానికి నోచుకోని అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఉద్యోగులపై ప్రయోగించే ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. 24 గంటల నిరహారదీక్ష పేరుతో రాత్రి పగలు తేడా లేకుండా జిల్లా కేంద్రాల్లో అంగన్‌వాడీలు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. రాష్ట్రంలోని అంగన్ వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడాన్ని నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించి పలువురు స్వచ్ఛంధంగా అరెస్టులు అయ్యారు. అయినా జగన్ సర్కార్ మాత్రం దున్నపోతుపై వర్షం కురిసిన చందంగానే వ్యవహరిస్తుంది. ఈ నేపథ్యం లోనే ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీలు దేశవ్యాప్తంగా ఉద్యమానికి సమాయత్తం అవుతున్నారు. **కాకినాడ** స్థానిక కలక్టరేట్ వద్ద మొదలు పెట్టిన 24 గంటల రిలే దీక్షలు నాలుగో రోజుకి చేరుకున్నాయి. ఈ సంద ర్భంగా ప్రత్తిపాడు, శంఖవరం అంగన్‌వాడీ ప్రాజె క్టుల నాయకులు అల్లాడి లక్ష్మీ, కాకరపల్లి సునీత, గెడ్డం బుల్లమ్మలతోపాటు, కానూరి హేమలత, టి.నాగసత్యవతి, ఎన్.అమలావతి, పి.గంగభవానీ, బి.ఉదయ గంగ, బి.రత్నకుమారి, బి.సత్యవేణి దీక్షను చేప ట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ సుప్రీంకోర్టు మీద సిఎం జగన్‌కు ఏమాత్రం గౌరవం ఉన్నా తక్షణమే అంగన్‌వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగాకనీస వేత ‍నాలు చెల్లించమంటే అంగన్‌వాడీ లపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దారుణమన్నారు. అవసరమైతే మరో 30 రోజులు సమ్మె చేయడానికైనా తాము సిద్ధంగా ఉన్నా మని, డిమాండ్లు సాధించుకునేంత వరకూ వెనకడుగు వేయమని అన్నారు. 4వ రోజు రిలే నిరాహార దీక్షలకు 108 సర్వీసెస్ కాంట్రాక్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రమణ, జిల్లా కమిటీ సభ్యుడు వి.తాతబ్బాయి, నగేష్, టెక్నీషియన్స్ నీలకంఠ, అబ్దుల్లా, గణేష్, శ్రీనివాస్, నూకరాజు, కాకి నాడ టాటా మోటార్స్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వాలిశెట్టి శ్రీను, పి.రాజా రమేష్, చక్రధర్, రాంబాబు, సురేష్, వరాలు, సాయి, రాఘవ, కొప్పిశెట్టి సత్తిబాబు, పంచాయితీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు పోచపల్లి రమణ, ఎపి బిల్డింగ్ అండ్ ఆదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు సూర్యనారాయణ, సిఐటియూ సీనియర్ నాయకులు మెడిశెట్టి వెంకట రమణ, టిఎన్‌టియుసి జోన్ 2 కార్యదర్శి సత్య ప్రసాదరావు మద్దతుగా మాట్లాడారు. **పిఠాపురం** తమ సమస్యలు పరిష్కారం కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా పిఠాపురం, గొల్లప్రోలు తహశీల్దార్ కార్యాలయాల వద్ద సమ్మె శిబిరాల్లో నిరసనను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.చిన్నా, యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, విజయశాంతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పద్మ, అమల, నళిని, ప్రజావాణి, బేబీ, సూర్యకాంతం, సరోజినీ, చంద్రలీల, పుష్పరత్నం తదితరులు పాల్గొన్నారు. **కోటనందూరు** స్థానికంగా నిర్వహిస్తున్న నిరసన శిబిరంలో అంగన్‌వాడీలు ఒంటికాలిపై నిలబడి రాష్ట్ర ప్రభుత్వానికి చేతులు జోడిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ధనలక్ష్మి, సుబ్బలక్ష్మి, ఉమామహేశ్వరి, షకీలా భాను, కుమారి, లలిత కుమారి, మనీ, రాజకుమారి, శ్రీదివ్య, దుర్గ భవాని తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** స్థానిక పంచాయతీ రాజ్ అతిథి గృహం వద్ద జరుగుతున్న సమ్మె శిబిరం వద్ద అంగన్‌వాడీలు నిరసనను కొనసాగించారు. ఉద్యమం ప్రారంభించి 30 రోజులు కావడంతో 30వ సంఖ్యలో కూర్చు ని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో యూనియన్ నాయకులు సుజాత, రాజేశ్వరి, రామ్ లీలా, అనంతలక్ష్మి, గంగాభవాని, తదిత రులు నాయకత్వం వహించారు. **కరప** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసన కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ ప్రాజెక్టు నాయకురాలు పి వీరవేణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్.వరలక్ష్మి, ఎస్ఎస్.కుమారి, దైవకుమారి, అచ్చారత్నం, కల్పలత, హెల్పర్ సత్యా మాధవి, ఎం.భవాని, నారాయణమ్మ, మంగతాయారు, సరోజినీ, జ్యోతి, కల్పలత, పి.లక్ష్మి, ఎ.దేవి, బి.మనోజ, లక్ష్మి, సాయిదుర్గ, బి.భవాని, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసన కొనసాగింది. సమ్మె 30వ రోజుకు చేరుకున్న సందర్భంగా 30 వ అంకె ఆకారంలో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, పద్మజ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో 24 గంటల రిలే దీక్షలో అంగన్‌వాడీలు



పిఠాపురంలో అంగన్‌వాడీల నిరసన

సమ్మెలకు మద్దతుగా శానిటేషన్ వర్కర్స్ ఆందోళన


ప్రజాశక్తి - కాకినాడ

మున్సిపల్, అంగన్‌వాడీ, సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె డిమాండ్స్ పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం ఆసుపత్రి గేటు ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్.విజయ్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు కోవిడ్‌లో ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించారని, అటువంటి కార్మికులకు ఒక్క నెల జీతం కూడా అదనంగా ఇచ్చింది లేదన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు సంపూర్ణంగా మద్దతు తెలుపుతున్నామని, అలాగే అంగన్‌వాడీ, ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న సమ్మెలకు మద్దతుగా జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ ఆందోళన చేపట్టడం కార్మిక వర్గ ఐక్యతను చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ, యూనియన్ నాయకులు శేషు, రమేష్, వాసు, వివిఎన్ కుమార్, దుర్గా ప్రసాద్, పుష్ప, తలుపులమ్మ, రమణమ్మ, శ్రీకాంత్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.



జిజిహెచ్ వద్ద ధర్నా చేస్తున్న శానిటేషన్ వర్కర్స్

కార్టూ'నిజం'



కొనసాగిన మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి 16వ రోజుకు చేరింది. **పెద్దాపురం** స్థానిక మున్సిపల్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సమ్మె శిబిరం వద్ద మున్సిపల్ కార్మికులు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, గతంలో మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ ఇచ్చిన హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వర్రె గిరి బాబు, శివకోటి అప్పారావు, సింగంపల్లి సింహాచలం, ద్రౌపతి శ్రీను, వేలాపు శివ, భవాని, ముత్యాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. **పిఠాపురం** గొల్లప్రోలు నగర పంచాయతీ కార్మికులు కంచాలు మోగిస్తూ నోటిలో గడ్డి పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు నాయకులు కె.చిన్న, వర్కర్స్ యూనియన్ నాయకులు అల్లం రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల మొండివైఖరి విడనాడాలన్నారు. కనీస వేతనం అమలు చేయాలని, పర్మినెంట్ చేయాలని, చనిపోయిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ నాయకులు రమణ, యేసమ్మ, సత్యవతి, మరిడియ్య, రాజమోహన్, లోవబాబు, పోలమ్మ, సింహాచలం, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ** స్థానిక నగరపాలక సంస్థ మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు బైఠాయించారు. ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మున్సిపల్ కాలనీలు ఏర్పాటు చేయాలని, మస్తార్ల కార్యాలయం వద్ద పని వేళల బోర్డు, మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని నినదించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొబ్బిలి శ్రీనివాసరావు, సుబ్బలక్ష్మి, నిమ్మకాయల విక్కి, ఆరుద్ర, బంగారు రాజేష్, చక్రి, నిమ్మకాయల ఈశ్వరరావు నాయకత్వం వహించారు.



పిఠాపురంలో నోట్లో గడ్డి పెట్టుకుని, కంచాలను మోదుతున్న కార్మికులు



పెద్దాపురంలో దీక్ష చేస్తున్న కార్మికులు

వాస్తవాలకు విరుద్ధంగా మంత్రి వ్యాఖ్యలు

ప్రజాశక్తి - పిఠాపురం, ఏలేశ్వరం

ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై రాష్ట్ర మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని పలువురు న్యాయవాదులు అన్నారు. స్థానికంగా జరుగుతున్న రిలే నిరహారదీక్షలను బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజారావు, కెఎస్ఆర్.భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు మేడపాటి ధర్మారెడ్డి, గుదిమెళ్ళ శ్రీభాస్కరాచార్యులు మాట్లాడుతూ న్యాయ వాదుల ఉద్యమం పట్ల ప్రభుత్వం సాను కూలంగా ఉన్నట్లు వ్యాఖ్యలు చేస్తూనే రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ద్వారా ఈ చట్టం చాలా గొప్పదన్నట్లు వ్యా ఖ్యలు చేయడం ప్రభుత్వం రెండు నాలు కల ధోరణి స్పష్టం చేస్తుందన్నారు. కొత్త సురేష్, జిపివి సత్యనారాయణ, కొంగు నూకరాజు, కోడిగుడ్డు లోవరాజు, విసరపు భార్గవి దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. ప్రత్తిపాడు కోర్ట్ ఆవరణలో న్యాయవాదులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బార్ అసోసి యేషన్ అధ్యక్షులు చిట్టంశెట్టి పుల్లయ్య మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల తోపాటు చిన్న, సన్నకారు రైతులకు కూడా ఇబ్బందికరంగా మారే ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్- 2022ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భార్ అసోసియేషన్ కార్యదర్శి బొంగు శూరి మధుబాబు, మాజీ అధ్యక్షుడు బుగతా శివ, న్యాయవాదులు ఆడారి సుగుణ, ఆకుల హరిబాబు, ఆర్ వెంకట్రావు, కె. సూర్యప్రకాష్, రాయి శ్రీను, పాల్గొన్నారు.



పిఠాపురంలో న్యాయవాదుల దీక్ష

నేరాలు ఘోరాలు

గంజాయి కేసులో ఇద్దరు అరెస్ట్



ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మూడేళ్ల క్రితం కిర్లంపూడి మండలం తామరాడ వద్ద 750 కేజీల గంజాయిని వదిలేసి పరారైన ముద్దాయిలను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు జగ్గంపేట సిఐ లక్ష్మణరావు తెలిపారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021లో కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ తిరుపతి రావు నమోదు చేసిన కేసును సాంకేతిక పరిజ్ఞానంతో చేదించడం జరిగిందన్నారు. 750 కేజీల గంజాయి 152 ప్యాకెట్లుగా చేసి స్కార్పియో వాహనంలో తరలిస్తూ ఆ వాహనాన్ని తామరాడ కాలువ గట్టున వదిలి వెళ్ళిపోయారని చెప్పారు. ఆ కేసులో ఐదుగురు ముద్దాయిలలో హనుమన్ శేకులల్ మోహింతి, సమీర్ సుధాకర్ గవండే అను ఇద్దరు మహారాష్ట్రకు చెందిన వారిని కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్ గేట్ వద్ద అరెస్ట్ చేశామన్నారు. మిగిలిన ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు సిఐ చెప్పారు.

20 లీటర్ల సారా స్వాధీనం



సారా బట్టీపై దాడి చేసిన పోలీసులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరులో బుధవారం నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ కెవి.స్వామి తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా సారా తయారికి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. పెద్దాపురం స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో తప్పించుకు తిరుగుతున్న ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ వై.నాగేంద్రకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సారా బట్టీపై పోలీసుల దాడి



సారా తయారీదారుడుతో సిఐ, ఎస్ఐ

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పట్టణ శివారులోని పిఠాపురం రోడ్‌లో తంబూరి వారి గొయ్యి సమీపాన నాటు సారాయి తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేశారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో సిఐ సురేష్, ఎస్ఐ మౌనిక, సిబ్బంది ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో 50 లీటర్లు సారా స్వాధీనం చేసుకుని, 1500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అరెస్టు చేసిన వ్యక్తి గతంలో సారా కేసుల్లో ముద్దాయేనని సిఐ సురేష్ తెలిపారు. ఈ దాడుల్లో విఆర్ఒ ఎన్.మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మరోసారి జగన్‌ను గెలిపించుకోవాలి : పొన్నాడ



ఇంటి స్థలం పట్టాను అందిస్తున్న ఎంఎల్ఎ పొన్నాడ

ప్రజాశక్తి - తాళ్లరేవు

రాబోయే ఎన్నికల్లో మరోసారి వైసిపికి ఓటు వేసి జగన్మోహన్ రెడ్డిని సీఎంను చేసుకోవాలని ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ కోరారు. మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో భాగంగా కోరంగిలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రతీ పేదవాడికి వైసిపి పాలనలో మేలు జరిగిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైసిపిని గెలిపించుకోవడం ద్వారా ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కోరంగి పంచాయతీ సర్పంచ్ పెయ్యల మంగేష్ శ్రీనివాస్‌అధ్యక్షతన జరిగిన సభలో ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి దొమ్మేటి సాగర్, జడ్‌పి మాజీ ఛైర్మన్ దున్నా జానార్ధనరావు, వైసిపి నాయకులు కాదా గోవింద్ కుమార్, దున్నా సత్య శ్రీకాంత్, ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి లలిత నాగరాజు, తదితరులు పాల్గొన్నారు

బెస్ట్ ఫిజిక్ పోటీల్లో ఆదిత్య విద్యార్థికి టైటిల్



పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి - గండేపల్లి

జెఎన్‌టియుకె ఇంటర్-కాలేజియేట్ బెస్ట్ ఫిజిక్ కాంపిటీషన్‌లో ఆదిత్య కళాశాలలో సివిల్ విభాగం ఫైనల్ ఇయర్ విద్యార్థి ఎన్.రోహిత్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్స్ టైటిల్‌ను సాధించాడు. కేరళలోని కాలికట్ విశ్వవిద్యాలయంలో నిర్వహించు ఆల్ ఇండియా ఇంటర్-యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ కాంపిటీషన్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఛాంపియన్ రోహిత్‌ను ఆదిత్య విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, కోచ్ డి.సాయి కిషోర్ అభినందనలు తెలిపారు.

ఆరోగ్యానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని పలు మండలాల్లో ఆడుదాం ఆంధ్రా పోటీలను బుధవారం నిర్వహించారు. **సామర్లకోట రూరల్** మండల పరిధిలోని ప్రభుత్వ పాటశాలల విద్యార్థులకు ఆడుదాం ఆంధ్రా పోటీలు బుధవారం ప్రారంభ మయ్యాయి. ఎంపిడిఒ దేవీ శ్రీ లలిత, ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు దవులూరి సుబ్బారావు, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు పాల్గొని మాట్లాడారు. పూర్వం విద్యతోపాటు క్రీడలకు పాఠశాలల్లో సమయం కేటాయించే వారని, ప్రస్తుతం ర్యాంకుల కోసం క్రీడల సమయాన్ని సైతం చదువుకే కేటాయించడం వలన విద్యార్దులు చిన్న వయసు నుంచే పలు బలహీనతలను పొనవుతున్నట్టు చెప్పారు. విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి ఎలిశెట్టి నరేష్, తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని రాయభూపాల పట్నంలో మండల స్థాయి ఆడుదా ఆడుదాం ఆంధ్ర పోటీలు ప్రారంభం అయ్యాయి. ఎంపిపి పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగిన సభలో జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు మాట్లా డారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడా నైపుణ్యతను పెంపొందించేందుకు ఆడుదాం ఆంధ్ర పోటీలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి మిర్యాల రాజా, సొసైటీ ఛైర్మన్ నల్లల నాగేంద్రబాబు, కంటే వీర రాఘవరావు, ముత్యాల రాజబ్బాయి, పరిమి శ్రీను, సర్పంచి చీకట్ల లక్ష్మి, పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని గొల్లపాలెం, కాజులూరు జడ్‌పి పాఠశాలలో మండల స్థాయి ఆడుదా ఆడుదాం ఆంధ్ర పోటీల ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి మాత భారతి పాల్గొని మాట్లాడారు. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విజయాలు సాధించి రామచంద్రపురం నియోజకవర్గానికి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రత్నరాజ్, సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ కాజులూరు ఉపసర్పంచ్ దండంగి చిన్నారావు, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, సూరిబాబు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



కాజులూరులో క్రీడా శిబిరాన్ని ప్రారంభిస్తున్న జడ్‌పిటిసి



సామర్లకోటలో క్రీడాకారులకు టోపీలు పెడుతున్న దవులూరి సుబ్బారావు

చంద్రబాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరు



ప్రజాశక్తి - కోటనందూరు

వెన్నుపోటుదారుడు చంద్రబాబును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరని రోడ్లు భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. బుధవారంనాడు రాత్రి తన నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు తునిలో ఏర్పాటు చేసిన సభకు జనం లేక కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయని అన్నారు. గత టిడిపి పాలనలో నియోజకవర్గంలో మరుగుదొడ్ల నిర్మాణంలోనే రూ.50 కోట్లు స్వాహా జరిగిందని ఆరోపించారు. చంద్రబాబు పాలనంతా దగా పాలన అని ప్రజలు గుర్తించే గత ఎన్నికల్లో ఓడించారని అన్నారు..1975 సంవత్సరంలోనే పేదలకు ఇల్లు స్థలాల నిర్మాణం కోసం పది ఎకరాలు ఉచితంగా ఇచ్చిన ఘన చరిత్ర తన కుటుంబానిదని ఆయన గుర్తు చేశారు. 1976లో మా తాతలు పంచుకున్న భూమి 400 ఎకరాలని అప్పట్లో చంద్రబాబు తిరుపతిలో జేబు దొంగతనాలు చేసుకునేవాడివని ఎద్దేవా చేశారు. మాదిని ఆయన గుర్తు చేశారు. సంక్రాంతి తరువాత రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పూర్తిగా ఖాళీ అవ్వడం ఖాయమని జోస్యం చెప్పారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను నిలిపే పరిస్థితికి చంద్రబాబు దిగజారిపోయాడని విమర్శించారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం చంద్రమాంపల్లి వాలంటీర్ పోతుల సత్యవేణి బుధవారం కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పింఛన్‌దారుడు కురుమెళ్ళ వెంకటరమణకు పింఛన్ సొమ్మును అందించారు. ఆమెను పలువురు అభినందించారు.



ఆసుపత్రిలో ఉన్న రోగికి పింఛన్ అందిస్తున్న వాలంటీర్

రక్తదానం ప్రాణదానంతో సమానం



ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వింగ్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కాకినాడ

రక్తదానం ప్రాణదానంతో సమానమని డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ జె.నరసింహ నాయక్ అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వింగ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రక్తదానం చేయడానికి యువకులు ముందుకు రావాలన్నారు. చేసిన రక్తదానం మరో ప్రాణాన్ని కాపాడేందుకు ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ సుగుణా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సేవా కార్యక్రమాల్లో ముందుండేలా అవగాహన కల్పిస్తున్నామని, రక్తం ఏ కంపెనీలోను తయారు కాదు కాబట్టి మానవతా దృక్పథంతో రక్తదానం చేయడం మంచిదని అన్నారు. డాక్టర్ ఆర్.రమేష్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ఒక అలవాటుగా చేసుకోవాలని పిలుపు నిచ్చారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో ముందుంటారని, బ్లడ్ బ్యాంకులలో రక్త నిల్వలు తగ్గుతున్న ప్రతిసారి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రక్తదానం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన విద్యార్థులను, 20వ సారి రక్తదానం చేస్తున్న తేజేశ్వరరావును, 17వ సారి రక్తదానం చేస్తున్న దివాకర రావును, అధ్యాపకులను అభినందించారు. ఈ సందర్భంగా రక్తదానం శిబిరాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వింగ్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, కాకినాడ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ వైడి రామారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ దుర్గరాజు, బ్లడ్ బ్యాంక్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అప్పలరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, ఎల్.దివాకర రావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్, తాళ్లరేవు

సామర్లకోటలోని ప్రతిభ విద్యానికేతన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్‌వి విజి.ప్రకాష్, సెక్రటరీ సుధారాణి ప్రకాష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత భోగిమంటల కార్యక్రమం నిర్వహించి, తదుపరి దీపప్రజ్వలనతో సంక్రాంతి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీవేంకటేశ్వరస్వామి, గోదాదేవి, ఆండాళ్ వేషధారణలు ప్రత్యేకంగా నిలిచాయి. చిన్నారులకు జరిపిన భోగిపళ్ళు, యువతులతో గొబ్బిళ్ళు కార్యక్రమాలు, హరిదాసు, గంగిరెద్దుల మేళం, సోదెమ్మ, బుడబుక్కల వేషధారణలు, తదనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.సునీత, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీగౌరీదేవి, పెద్దాపురం ప్రిన్సిపల్ టి.అరుణ, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** కోరంగిలోని కైట్ విద్యాసంస్థల ప్రాంగణం, కోరంగి ఫార్మసీ కళాశాలల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ప్రముఖ విద్యావేత్త దోర్బల ప్రభాకర్ శర్మ భోగి మంటను వెలిగించి, కైట్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. అలాగే ఫార్మసీ కళాశాలలో సంబరాలను కళాశాల ఛైర్మన్ దున్నా జనార్ధనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఊరేగింపు, విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వై.రామకృష్ణ, డి.రేవతి, ఉపాధ్యాయులు ఐశ్వర్య, సురేఖ, రామ్ కిరణ్, మధు, కాశీ రావు తదితరులు పాల్గొన్నారు. ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ పి.కనకరాజు, డైరెక్టర్ చిట్టూరి కలికి మూర్తి, ర్యాలీ సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, కోరంగి ప్రాథమిక పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తాళ్లరేవు మండలం కోరంగిలో ఫార్మసీ కళాశాలలో సంక్రాంతి వేడుక



సామర్లకోట ప్రతిభ గ్రౌండ్‌లో భోగి మంట వేస్తున్న విద్యార్థులు

చోరీల నివారణకు నైట్ పెట్రోలింగ్



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఎస్ఐ చంద్రశేఖర్

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో వ్యవసాయ బోర్ల వైర్లు మరియు ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాల నివారణకు పోలీసులతో నైట్ పెట్రోలింగ్‌ను నిర్వహిస్తామని ఎఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పలు ప్రాంతాల్లో రైతుల వ్యవసాయ బోర్ల వద్ద వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించుకుపోతున్నారు. దీనిపై ఇప్పటికే రైతులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలోనే బుధవారం రైతులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దొంగతనాలు జరుగుతున్న తీరును వివరించారు. గతంలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులను పట్టుకుని పోలీసులకు అప్పగించినా వారిపై చర్యలు తీసుకోలేదని వివరించారు. దీనిపై ఎఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే కొందరు రైతులు సంబంధిత మోటర్లకు మొబైల్ అలారాలను ఏర్పాటు చేసుకున్నారని, దీనివల్ల ఎవ్వరైనా మోటార్లను, ట్రాన్స్‌ఫార్మర్లను ముట్టుకున్నట్లు అయితే తక్షణమే మీ ఫోన్‌లకు అలారం వస్తుందని, తద్వారా వెంటనే వచ్చి ఆ దొంగలను పట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆ సమయంలో దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించాలని, వారిపై దాడి చేయడం వంటి చేయరాదని తెలిపారు. దీనికితోడు పోలీసులతో నైట్ పెట్రోలింగ్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

టిడిపి సభకు తరలిన శ్రేణులు



ఏలేశ్వరం నుంచి తునికి బయలుదేరిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - రౌతులపూడి, పిఠాపురం, ఏలేశ్వరం

తునిలో టిడిపి బహిరంగ సభకు ఏలేశ్వరం నుంచి టిడిపి నాయకులు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి ఆధ్వర్యంలో టిడిపి, జనసేన శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ ర్యాలీని రాష్ట్ర బీసీ ఫెడరేషన్ కార్యదర్శి వాసంశెట్టి సత్య ప్రారంభించారు. రౌతులపూడి మండలం నుంచి పెద్దఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. టిడిపి మండల అధ్యక్షులు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపిపి భాస్కర్ బాబు, జిల్లా టిడిపి బిసి సెల్ అధ్యక్షులు పైల సాంబశివరావు ఎంపిటిసి సభ్యులు సోమరవుతు రవి నాయకత్వంలో భారీ ర్యాలీగా తరలివెళ్లారు. పిఠాపురం నుంచి మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు, మాజీ జడ్‌పిటిసిలు, సీనియర్ నాయకులు, కౌన్సిలర్, కార్యకర్తలు ఉన్నారు.

పోషకాహారం పంపిణీ



పోషకాహారం కిట్లు అందిస్తున్న రాఘవరావు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం వడ్లమూరు గ్రామంలో బుధవారం 20 మంది గర్భిణీలు, బాలింతలకు వైసిపి రాష్ట్ర నాయకుడుకంటే వీర రాఘవరావు చేతుల మీదుగా సంపూర్ణ పోషకాహారం సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ చల్లా రామాంజనేయులు, వాయిలేటి చిన్నారావు, ఉండమట్ల గంగాధర్, బిక్కిన సాయిరాం, మహిళా పోలీసు వెంకటలక్ష్మి, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కిల్కారీ సేవలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కిల్కారీ సేవలపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కిల్కారీ ప్రోగ్రాం అధికారి అర్.మోహన్ రావు పాల్గొని గర్భిణీ లకు, బాలింతలకు, 1 సంవత్సరంలోపు పిల్లలకు అందించవలసిన పోషణ, తదితర సేవలపై ఎఎన్ఎం, ఆశా, ఎంఎల్‌హెచ్‌పి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీరామ్, ఎంపిహెచ్ఇఒ, పిహెచ్ఎన్, పి హెచ్ సి సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎఎన్ఎం, ఆశాలు

యానాం వార్తలు

నష్ట పరిహారం విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో ఉన్న 12 మత్స్యకార గ్రామాల ప్రజలకు ఒఎన్‌జిసి అందించిన నష్టపరహారాన్ని పుదుచ్చేరి ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని బుధవారం ఆందోళన చేశారు. స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం ఎదుట వందలాది మంది మత్స్యకారులు బైఠాయించి తమకు ప్రైవేటు చమురు సంస్థ అందించిన నష్టపరిహారాన్ని పుదుచ్చేరి ప్రభుత్వం బాధితులకు అందించడానికి ఎందుకు జాప్యం చేస్తుందో అర్థం కావడం లేదన్నారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే నాలుగు పర్యాయాలు ప్రతి మత్స్యకారుడికి పరిహారాన్ని అందించారని, అదేవిధంగా యానాంలో ఎందుకు అందించలేక పోతున్నారని అన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి మత్స్యకారుడికి పరిహారాన్ని తక్షణమే విడుదల చేసేలా పుదుచ్చేరి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే తీవ్ర స్థాయి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం యానం పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని స్థానిక పిల్లారాయ వీధిలోని పోలీసులు అడ్డగించి విరమింప చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

ప్రజాశక్తి - యానాం

మద్యం మత్తులో కారును డ్రైవ్ చేసి విద్యుత్ స్తంభాన్ని ఢికొట్టిన సంఘటన బుధవారం యానాంలో జరిగింది. ఉమ్మడి కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన కోట చంనద కుమార్, కర్రి యశ్వంత్ చెన్నైలో ఉంటున్నారు. అయితే కొద్ది రోజులుగా అరటికాయలలంక వద్ద ఉన్న రిసార్ట్‌లో ఉంటున్నారు. యానాం వచ్చి మద్యంను పూటుగా దాగి కారును డ్రైవ్ చేసుకుంటూ వెళుతూ విద్యుత్ స్తంభాన్ని ఢికొట్టారు. ఈ ప్రమాదంలో ఆ యువకులు ప్రాణాలతో బయటపడ్డారు. అయితే కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఈ మేరకు ఇద్దరి యువకులపై కేసు నమోదు చేసి, కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పువ్వుల వీరభద్రరావు వెల్లడించారు.